VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 313
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శుక్రవారం 1 మే 2026

# ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ... ఆమోదం పొందిన 41 అంశాలు ఇవే!

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ముగిసిన ఏపీ క్యాబినెట్ సమావేశం
- వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 41 కీలక అంశాలకు మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్
- అమరావతి నిర్మాణ పనులు, కరకట్టకు నిధులు, పోలవరం నిర్వాసితులకు లబ్ధి
- 23 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు
- పలు సంస్థలకు భూ కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పరిపాలన ఆమోదం




**అమరావతి,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ముగిసింది. ఈ భేటీలో పలు శాఖలకు సంబంధించి మొత్తం 41 కీలక అంశాలపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. హోంశాఖ, న్యాయ, పంచాయతీరాజ్, పరిశ్రమలు, పురపాలక, జలవనరులు, రెవెన్యూ వంటి అనేక శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

**క్యాబినెట్ తీసుకున్న 41 కీలక నిర్ణయాలు ఇవే...**

1. 23 ఏళ్లుగా పదోన్నతులు లేకుండా కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న 385 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ వారి పోస్టులను అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం. 2. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని న్యాయ విభాగాల్లో 5 చీఫ్ కోర్ట్ మేనేజర్, 15 సీనియర్ కోర్ట్ మేనేజర్ పోస్టులతో సహా మొత్తం 21 కొత్త పోస్టుల సృష్టికి ఆమోదం. 3. న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో అడ్వకేట్ ఆన్ రికార్డ్ కార్యాలయం కోసం ఒక ఆఫీస్ మేనేజర్ పోస్టును కొత్తగా ఏర్పాటు చేయడానికి నిర్ణయం. 4. ఉపయోగంలో లేని 20 పోస్టులను రద్దు చేసి, పరిశోధన సంస్థల్లో అవసరమైన చోట 20 కొత్త పోస్టులను సృష్టించడానికి ఆమోదం. 5. రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణంలో భాగంగా డ్రెడ్జింగ్, పర్యావరణ నిబంధనల మేరకు అదనపు పనుల కోసం రూ.354.23 కోట్లకు పరిపాలన అనుమతి. ఇది మొత్తం ప్రాజెక్టు వ్యయంలోనే సర్దుబాటు అవుతుంది. 6. మార్క్‌ఫెడ్ రూ.1800 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ లోన్ తీసుకునేందుకు ప్రభుత్వ గ్యారెంటీకి క్యాబినెట్ ఆమోదం. 7. ఢిల్లీలోని 11.53 ఎకరాల స్థలంలో ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని ప్రతిబింబించేలా రూ.124.5 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి ఆమోదం. నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌బీసీసీకి అప్పగింత. 8. రాష్ట్రంలోని వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులకు 2 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీల నుంచి మినహాయింపు. దీనివల్ల రూ.25 కోట్ల విలువైన ప్రాజెక్టులకు లబ్ధి. 9. పురపాలక సంఘాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌ల లీజుకు సంబంధించి ఏకరీతి విధానం. ప్రతి ఏటా 7% అద్దె పెంచేలా నిబంధన. 10. కమర్షియల్ కాంప్లెక్స్‌లలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పోలిస్తే ఫస్ట్ ఫ్లోర్‌పై 20 శాతం, సెకండ్ ఫ్లోర్‌పై 30 శాతం తక్కువ అద్దె ఉండేలా నూతన విధానం. 11. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఆస్తిపన్నుకు సంబంధించి ఏకరీతి ఆటో మ్యూటేషన్ ఛార్జీల విధానానికి ఆమోదం. 12. కృష్ణా నది కుడిగట్టు (కరకట్ట) పటిష్టత, విస్తరణ పనులకు రూ.443 కోట్లతో సవరించిన అంచనాలకు ఆమోదం. గతంలో కాంక్రీట్ వాల్ కోసం వేసిన రూ.1304 కోట్ల అంచనాను రద్దు చేశారు. 13. అమరావతిలో సెక్రటేరియట్, హెచ్‌ఓడీ, జీఏడీ టవర్ల నిర్మాణంలో గ్లాస్ క్లాడింగ్, క్రౌన్, ఇతర పనుల కోసం రూ.2540 కోట్లకు పరిపాలన ఆమోదం. 14. అమరావతిలో 43 అంతస్తులతో రెండు క్వాంటం టవర్ల (ట్విన్ టవర్స్) షెల్ అండ్ కోర్ నిర్మాణానికి రూ.1208 కోట్లకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్. 15. అసెంబ్లీ భవనం సెంట్రల్ స్పైర్, పార్కింగ్, అప్రోచ్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.798 కోట్లకు పరిపాలన అనుమతి. 16. ఉండవల్లి (జోన్-2) లేఅవుట్లలో రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.580 కోట్లకు ఆమోదం. 17. సీఆర్‌డీఏ పరిధిలో ఎన్10-ఎన్13 జంక్షన్ల

- 2లో






అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయంలో 'డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్' కార్యక్రమంలో భాగంగా మంత్రులు, హెచ్ఓడీలు, సెక్రటరీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆత్మీయ విందు. హాజరైన మంత్రులు, హెచ్ఓడీలు, సెక్రటరీలు.

–అమరావతి,కలంకౌంటర్ :






# విద్యార్థుల విజయానికి మంత్రి కందుల దుర్గేష్ సలాం

- పదో తరగతి ఫలితాల్లో నిడదవోలు విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం
- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపిన మంత్రి దుర్గేష్
- నిడదవోలు విద్యార్థుల విజయం నియోజకవర్గానికి గర్వకారణం అంటూ మంత్రి కందుల దుర్గేష్ ప్రశంసలు
- విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించిన మంత్రి కందుల దుర్గేష్
- నిడదవోలులోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను,విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు అభినందనలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు/అమరావతి, కలంకౌంటర్ :** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నిడదవోలు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మరియు ఎయిడెడ్, ఇతర పాఠశాలల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరచడం పట్ల రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు సాధించిన ఈ అద్భుతమైన మార్కులు వారి కష్టానికి, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. నియోజకవర్గ స్థాయిలోనే కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ మన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి విజయానికి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు మంత్రి దుర్గేష్ మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన విద్యాశాఖ అధికారులు మరియు ఉపాధ్యాయుల కృషిని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థు లందరూ ఇదే పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు. "చదువే సంపద అని నమ్మి, క్రమశిక్షణతో చదివిన విద్యార్థులు నిడదవోలు నియోజకవర్గానికి మంచి పేరు తెచ్చారు. రాబోయే రోజుల్లో వీరికి ప్రభుత్వం తరపున మంచి ప్రోత్సాహం ఉంటుంది" అని మంత్రి దుర్గేష్ భరోసా ఇచ్చారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మరింత బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలని దిశానిర్దేశం చేశారు..రాష్ట్రవ్యాప్తంగా ఉత్తీర్ణత శాతంపై సంతోషం వ్యక్తం చేశారు.

# టెన్త్ లోనూ బీసీ బిడ్డల హవా




- ఏంజేపీలో 96.02 శాతంతో ఉత్తీర్ణత
- రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే 10 శాతం అధికం
- విద్యార్థుల సంఖ్యాపరంగా ఎంజేపీదే ఉత్తీర్ణతా శాతం టాప్
- 100 బీసీ గురుకులాల్లో 32 గురుకులాల్లో నూరు శాతం ఫలితాలు
- గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణతా శాతం
- ఇంటర్ లోనూ సత్తాచాటిన బీసీ విద్యార్థులు
- బీసీ హాస్టళ్లలోనూ అదే జోరు... 85.99 శాతం ఉత్తీర్ణత
- బీసీ బిడ్డల అత్యుత్తమ ఫలితాల సాధనపై మంత్రి సవిత హర్షం
- సత్ఫలితాలిచ్చిన మంత్రి లోకేశ్ వంద రోజుల ప్రణాళికలు
- కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితమే ఈ అత్యుత్తమ ఫలితాలు : మంత్రి సవిత
- అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబరాలు
- కార్యదర్శి సత్యనారాయణను, ఎంజేపీ కార్యదర్శి మాధవీలతను అభినందించిన మంత్రి సవిత

- 2లో

# పశుసంవర్ధక రంగానికి నూతన దిశా నిర్దేశం

- "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ - మేగజైన్‌తో రైతులకు శాస్త్రీయ మార్గనిర్దేశం
- పాడి పశువుల నుంచి కోట్ల ఆర్థిక వృద్ధి
- రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు
- ప్రతి ఇంటికో ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి/విజయవాడ, కలంకౌంటర్ :** రాష్ట్రంలో పశుసంవర్ధక రంగ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే ఉద్దేశంతో "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను రాష్ట్ర వ్యవసాయ, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులు పాడి పశువులు, సన్న జీవాలు, నాటు కోళ్ల పెంపకంతో అనుబంధం కలిగి ఉన్నారని తెలిపారు. 2025--26 సంవత్సరానికి పశుసంవర్ధక శాఖ ద్వారా రూ.1,76,151 కోట్ల స్థూల విలువ వృద్ధి నమోదవడం ఈ రంగ ప్రాధాన్యతను స్పష్టంగా చూపుతోందన్నారు. అయినప్పటికీ సంప్రదాయ యాజమాన్య పద్ధతులు, కూలీల కొరత, పశుగ్రాసాల లోపం, పెరుగుతున్న దాణా ఖర్చులు వంటి సమస్యల కారణంగా ఆశించిన స్థాయి వృద్ధి సాధ్యంకావడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ, అదే సమయంలో పశుసంవర్ధక రంగాన్ని వాణిజ్య సరళిలో అభివృద్ధి చేసుకునే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. పాడి పశువులు, జీవాలు, నాటు కోళ్లు, పందుల పెంపకం వంటి రంగాల్లో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని రాష్ట్ర పశుగణ యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల వ్యవస్థాపక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1500 మంది శిక్షణ పొందగా, అందులో సుమారు 200 మంది రైతులు వాణిజ్యపరంగా లాభసాటిగా పశుసంవర్ధక కార్యకలాపాలను విజయవంతంగా ప్రారంభించినట్లు వెల్లడించారు. రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన "పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను ఏప్రిల్ నెల నుండి [www.apahsmile.in (http://www.apahsmile.in) "స్మైల్" వెబ్‌సైట్‌తో పాటు రిలయన్స్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ మేగజైన్‌లో పశు ఆరోగ్యం, పునరుత్పత్తి, పోషణ, యాజమాన్యం, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై సమగ్ర సమాచారం, విజయగాథలు, నిపుణుల సూచనలు, రైతుల సందేహాలకు సమాధానాలు అందించబడతాయని చెప్పారు. అలాగే, గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న పశుసంవర్ధక సహాయకులు, గోపాల మిత్రులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడంలో కూడా ఈ-మేగజైన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పశుసంవర్ధక రంగాన్ని సేంద్రియ, వాణిజ్య పద్ధతుల్లో అభివృద్ధి చేస్తే ఒక్క ఎకరం నుంచి సంవత్సరానికి రూ.5-6 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశముందని మంత్రి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించినట్లుగా ప్రతి ఇంటిలో ఒక ఎంట్రప్రెన్యూర్ ఏర్పడి, వ్యక్తిగత అభివృద్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డా.వై. సింహాచలం, జాయింట్ డైరెక్టర్ డా. బైరాగి, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యా విభాగాలపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** సమీక్షకు హాజరైన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏపీలోని విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రావాలని.. కోర్సుల ఫోర్ క్యాస్టింగ్ జరగాలని సీఎం సూచన. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అందిస్తున్న కోర్సుల రీస్ట్రక్చరింగ్ జరగాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం. రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్ లను ప్రోత్సహించేలా విద్యా వ్యవస్థ మార్పులు అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి సూచన. క్వాంటం టెక్నాలజీపై కోర్సును ప్రారంభించిన ఆంధ్రా యూనివర్సిటీని అభినందించిన సీఎం. ప్రపంచ స్థాయి వర్శిటీలతో ఏపీ విశ్వవిద్యాలయాలు పోటీ పడేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు.

## ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు త్వరగా పూర్తి చేయండి

### –ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.





**తిరుపతి,కలంకౌంటర్ :** నగరంలోని ప్రజల నుండి వచ్చిన ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. గురువారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల లేఔట్లను, పారిశుధ్ధ్య పనులను అధికారులతో కలసి ఇంచార్జి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అందరూ కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. నగరంలో పారిశుధ్ధ్య పనులను మరింత మెరుగ్గా చెపట్టాలని సూచించారు. కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్త తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో రోడ్లలోని డివైడర్లలో మొక్కలు పెంచాలని సూచించారు. ఇంచార్జి కమిషనర్ వెంట డి.ఈ. దేవిక, ఏసీపీ లు పార్వతి ప్రియ, మూర్తి, టీపీఓ వంశీ, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, ప్లానింగ్ సెక్రెటరిలు, తదితరులు ఉన్నారు.

## లిటిల్ ఫ్లవర్ స్కూల్ విజయకేతనం










**మచిలీపట్నం,కలంకౌంటర్ :** పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మచిలీపట్నం రాజుపేట లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అత్యధిక మార్కుల సాధించిన వారిలో అనిశెట్టి గేయ శ్రీవల్లి –590/600 ,మానస దుర్గా –581/600 ,సరయు 577/600 సాధించినట్లు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి శ్రీదేవి తెలిపారు. హాజరైన 49 మందిలో 12 మందికి 500 పైగా సాధించి నట్లు తెలిపారు. తెలుగు లో 8 మందికి 100/100, మ్యాథ్స్ లో ఇద్దరికీ 100/100 సోషల్ లో ఒక విద్యార్థి 100/100 సాధించి నట్లు తెలిపారు. ఈ విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు,తల్లి తండ్రులకు కరస్పాండెంట్ నవీన్ కృష్ణ ,ప్రిన్సిపాల్ నాగ లక్ష్మీ శ్రీదేవి కృతజ్ఞతలు తెలియచేశారు.

## ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు వర్ష సూచన



**విశాఖపట్నం,కలంకౌంటర్ :** ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని హెచ్చరిక భానుడి భగభగలతో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ద్రోణి విస్తరించి ఉన్నట్టు వెల్లడించింది.

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆత్మీయ విందు



**అమరావతి,కలంకౌంటర్ :** బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్–2025 అవార్డు వచ్చినందుకు మంత్రులు, సీఎస్, డీజీపీ, సెక్రటరీలు, హెచ్వోడీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆత్మీయ విందు

**సమావేశంలో మంత్రుల ప్రసంగాలు:** పెట్టుబడులు రాబట్టే విషయంలో సీఎం చంద్రబాబు తమను పరుగులు పెట్టిస్తున్నారన్న మంత్రి టీజీ భరత్. పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు కుదుర్చుకోవడంతో పాటు... ఆ పరిశ్రమలు గ్రౌండింగ్ చేసేంత వరకు విశ్రమించవద్దని సీఎం చంద్రబాబు పదే పదే గుర్తు చేస్తూ ఉంటారన్న మంత్రి భరత్. చంద్రబాబు సూచనలతో పరిశ్రమలు గ్రౌండింగ్ చేసేందుకు.. గ్యాప్ రాకుండా ఉండేందుకు 90 మంది వాట్సాప్ గ్రూప్ పెట్టుకుని పనిచేస్తున్నామన్న పరిశ్రమల శాఖ మంత్రి. ఇంజనీరింగ్ విద్య కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితులున్న రోజుల్లో ఇంజనీరింగ్ కాలేజీలతో రాష్ట్రాన్ని నింపి నాలెడ్జ్ ఎకానమీకి చంద్రబాబు బాటలు వేశారన్న మంత్రి నిమ్మల. పట్టిసీమను ఒట్టిసీమ అని చంద్రబాబు నిర్ణయాన్ని విమర్శించారని... కానీ అదే పట్టిసీమ రూ.50 వేల కోట్ల సంపదను సృష్టించిందని...దటీజ్ చంద్రబాబు అంటూ నిమ్మల కామెంట్. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రికార్డు స్థాయిలో హంద్రీ–నీవా జలాలను రాయలసీమకు తీసుకెళ్లామని వివరించిన నిమ్మల రామానాయుడు సింగపూర్ దేశానికి అధ్యయనం చేసేందుకు వెళ్లినప్పుడు తిరిగి వెళ్లాక చంద్రబాబు ఏం అడుగుతారోననే భయంతో ఆ దేశంలో 7 రోజులపాటు క్లాసులకు అటెండ్ అయ్యామని నవ్వుతూ కామెంట్ చేసిన మంత్రి సత్యకుమార్. తాను చదువుకునే రోజుల్లో కూడా కాలేజీకి సరదాగా వెళ్లేవాడినని... సింగపూర్ పర్యటనలో మాత్రం భుజాన బ్యాగ్ వేసుకుని సీరియస్‌గా క్లాసులకు హాజరయ్యామంటూ వ్యాఖ్యానించిన మంత్రి సత్యకుమార్ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలని నిర్ణయించుకున్న కేంద్రాన్ని ఒప్పించి రూ.11 వేల కోట్లకుపైగా సీఎం నిధులు ఇప్పించారని, ఇది అసాధారణ పరిణామం అని వ్యాఖ్యానించిన సత్యకుమార్ అంత పెద్ద నిర్ణయంలో ఏం చెప్పి ప్రధాని మనస్సు మార్చారో తెలియదని నవ్వుతూ వ్యాఖ్యానించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ రిఫార్మర్ అనే పదానికి రాజకీయాల్లో నిజమైన నిర్వచనం సీఎం చంద్రబాబు అని చెప్పిన మంత్రి కందుల దుర్గేష్. రిలాక్స్ కాకుండా నిరంతరం తాను పని చేయడంతోపాటు.. టీమ్ కూడా అలాగే పని చేయాలని... అప్పుడే అభివృద్ధి–సంక్షేమం అందించగలమని చంద్రబాబు చెబుతారన్న మంత్రి దుర్గేష్.

# రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి - రాష్ట్ర మంత్రి కే పి సారధి





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఈశ్వరుని దయతో రాష్ట్రమంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని యాగాలు చేస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణం సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. గురువారం ఉదయం మంత్రివర్యులు వారి స్వగ్రామమైన కృష్ణాజిల్లా మొవ్వ మండలం కారకంపాడు గ్రామంలో శివాలయం శ్రీముఖ లింగేశ్వర ఆలయం యాగశాల వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కారకంపాడు గ్రామంలో గ్రామస్తుల కోరిక మేరకు అందరము కలిసి శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీముఖ లింగేశ్వర స్వామి శివాలయాన్ని నిర్మించుకున్నామన్నారు. గత 4 రోజులుగా క్రతువులను ఆగమ శాస్త్ర ప్రకారం యధాతధంగా అనుసరిస్తూ వేద పండితులతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈశ్వరుని దయతో రాష్ట్రానికి మేలు జరగాలని, రాష్ట్రమంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ సంతోషంగా జీవించాలని యాగాలు చేస్తున్నామన్నారు నిన్నటి రోజున ప్రియతమ యువనేత నారా లోకేష్ పదవి స్వీకారం సందర్భంగా భవిష్యత్తులో ఆయనకు ఈశ్వరుని దయతో మరింత శక్తి సామర్థ్యాలు పెంపొందాలని రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ చేస్తున్న కృషి ప్రయత్నాలు సఫలీకృతం కావాలనీ నేడు రాజశ్యామల యాగం, చండీయాగం చేస్తున్నామన్నారు. వారి గోత్రనామాల మీద పూజా సంకల్పం చెప్పి యాగాలు చేస్తున్నామన్నారు. ఈశ్వరుని దయతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థించామన్నారు. యువతకు మంచి భవిష్యత్తు ఉండాలని, ఉద్యోగాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి సఫలీకృతం కావాలని భగవంతుని మనసారా కోరుకుంటున్నామన్నారు ఈశ్వరుని దయతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు శక్తియుక్తులు ఇంకా బలం చేకూరాలని ప్రార్థిస్తున్నామన్నారు.

# జీ ఎం ఆర్ ను కలిసిన ఎం ఎల్ ఎ



**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** ఢిల్లీలో జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ని కలిసిన విజయనగరం శాసనసభ్యులు అదితి విజయలక్ష్మి గజపతి రాజు, శాప్ చైర్మన్ రవి నాయుడు. విజ్జీ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ స్థాపనపై చర్చ. యువ క్రీడాకారులకు ఆధునిక శిక్షణ సదుపాయాల అందించడమే లక్ష్యం. ప్రభుత్వం – ప్రవేట్ భాగస్వామ్యంతో ఉత్తరాంధ్రను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళిక. స్థానిక ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా చర్యలు. విజయనగరంలోని విజ్జి స్టేడియం వద్ద స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసిన శాసనసభ్యులు అదితి విజయలక్ష్మి గజపతి రాజు,శాప్ చైర్మన్ రవి నాయుడు. స్పోర్ట్స్ స్కూల్ పై సానుకూలంగా స్పందించిన జిఎంఆర్ గ్రూప్ చైర్మన్.


## 10 వ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు

- 85.32 శాతం ఉత్తీర్ణత
- విద్యార్థులకు మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అభినందనలు

**అమరావతి,కలంకౌంటర్ :** గురువారం విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు సత్తా చాటారు. 85.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు

# ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ... ఆమోదం పొందిన 41 అంశాలు ఇవే!

(మొదటి పేజీ తరువాయి)



వద్ద అండర్‌గ్రౌండ్ కేబుల్ రీ–రూటింగ్ కోసం సవరించిన అంచనా రూ.1180.54 కోట్లకు ఆమోదం. 18. గతంలో రెవెన్యూ శాఖకు బదలాయించిన సీఆర్‌డీఏ భూములను (ఆర్–5 జోన్‌తో సహా) తిరిగి సీఆర్‌డీఏకు అప్పగించడానికి క్యాబినెట్ నిర్ణయం. 19. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద రైతుల కౌలు పెంపు, కటాఫ్ తేదీ పొడిగింపు వంటి అభ్యర్థనలకు ఆమోదం. 20. సీఆర్‌డీఏ భూ కేటాయింపులు: సెబీకి 1.5 ఎకరాలు. 21. స్వామినారాయణ గురుకులానికి పాఠశాల కోసం భూమి. 22. ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు భూమి. 23. డీఏవీ పబ్లిక్ స్కూల్‌కు భూమి కేటాయింపులకు క్యాబినెట్ ఆమోదం. 24. పోలవరం నిర్వాసితులకు అదనపు ప్యాకేజీ కింద సొంతంగా ఇల్లు కట్టుకునే వారికి యూనిట్ ధర రూ.3.57 లక్షలకు పెంపు. 25. ఆర్అండ్ఆర్ కాలనీ బయట ఇల్లు కట్టుకునే వారికి హౌస్ సైట్ కోసం ఇచ్చే మొత్తాన్ని రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంపు. 26. పుష్కర ఎత్తిపోతల పథకంలో ఎస్కేప్ ఛానల్ నిర్మాణం కోసం రూ.4.71 కోట్లను నామినేషన్ పద్ధతిపై కేటాయించేందుకు ఆమోదం. 27. హంద్రీనీవా సుజల స్రవంతి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ఆధునికీకరణ పనులకు సవరించిన అంచనా రూ.309 కోట్లకు ఆమోదం. 28. తిరుపతి జిల్లా రేణిగుంటలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు కోసం సన్‌రైజ్ ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్‌కు మార్కెట్ ధరకు 10 ఎకరాల భూమి కేటాయింపు. 29. కడప నగరంలో ఆధునిక డంపింగ్ యార్డ్ కోసం మున్సిపల్ కార్పొరేషన్‌కు 92 ఎకరాల భూమి బదలాయింపు. 30. ప్రకాశం జిల్లాలో ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ హబ్ కోసం మార్కెట్ విలువకు 22 ఎకరాల భూమి. 31. చిత్తూరు జిల్లా యాదమరి మండలంలో ఫ్రూట్ ప్యాకింగ్ యూనిట్ కోసం ఏపీ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు 13 ఎకరాల కేటాయింపు. 32. అనంతపురం–హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా)కి ఎంఐజీ లేఅవుట్ కోసం 11 ఎకరాల భూమికి ఆమోదం. 33. కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్‌లో కేజ్ కల్చర్ కోసం 'ఫిష్ ఇన్ ఇండియా' సంస్థకు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని లీజుకు ఇవ్వడానికి నిర్ణయం. 34. కాకినాడ అర్బన్‌లో కోర్టు కాంప్లెక్స్, నివాస భవనాల కోసం ప్రభుత్వ భూమి కేటాయింపు. 35. విజయనగరం, ఒంగోలు, కర్నూలు, తూర్పుగోదావరి, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో టీడీపీ కార్యాలయాల నిర్మాణానికి 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపు. 36. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ ట్రస్ట్ కోసం 1.5 ఎకరాల ప్రభుత్వ భూమిని లీజుకు ఇవ్వడానికి ఆమోదం. 37. కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నీటి సరఫరా పనుల కోసం ఏపీఐఐసీ తీసుకున్న రూ.75 కోట్ల రుణ ప్రతిపాదనకు రాటిఫికేషన్. 38. సత్యసాయి జిల్లాలో డిఫెన్స్ పరిశ్రమ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ డీఆర్డీవోకు దాదాపు 600 ఎకరాల భూమి కేటాయింపునకు సూత్రప్రాయ అంగీకారం. 39. బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి సవరించిన అంచనా రూ.1586 కోట్లకు ఆమోదం. 40. కిసాన్ డ్రోన్ల వినియోగం కోసం మిగిలిన కేంద్ర నిధులను (దిరూ.14 కోట్లు) వాడుకునేందుకు పాత సంస్థకే కాంట్రాక్టు పొడిగింపు. 41. డిస్కంలు ఆర్ఈసీ నుంచి తీసుకునే రూ.7000 కోట్ల రుణానికి ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీని పొడిగించడానికి క్యాబినెట్ ఆమోదం.

# టెన్త్ లోనూ బీసీ బిడ్డల హవా

**అమరావతి,కలంకౌంటర్ :**పదో తరగతి ఫలితాల్లోనూ మహాత్మా జ్యోతి రావు పూలే బీసీ గురుకుల పాఠశాలలు(ఎంజేపీ) విద్యార్థులు సత్తాచాటారు. 96.02 శాతం సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థుల సంఖ్యాపరంగా ప్రభుత్వ పరిధిలో నడిచే విద్య సంస్థలు, గురుకులాల్లో ఎంజేపీ గురుకులాలు ఫస్ట్ ప్లేస్ లో నిలిచాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు వంద బీసీ గురుకుల విద్యా సంస్థలు హాజరుకాగా, 32 గురుకులాల్లో వంద శాతం మేర ఫలితాలు రావడం విశేషం. రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే ఎంజేపీ గురుకులాలు 10 శాతం కంటే అధికంగా ఫలితాలు సాధించడం విశేషం. రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమై, ఏప్రిల్ రెండో తేదీన ముగిశాయి. ఈ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం విడుదల చేశారు. 6,18,131 మంది విద్యార్థులకు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా, 85.25 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల విద్యార్థులు టెన్త్ లోనూ సత్తాచాటారు. ఇటీవల వెల్లడించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫస్ట్ ఇంటర్ లో 97 శాతం, సెకండ్ ఇంటర్ లో 94 శాతంతో బీసీ బిడ్డలు ఉత్తీర్ణత శాతం సాధించి భేష్ అనిపించుకున్నారు. టెన్త్ లోనూ అదే స్థాయిలో ఫలితాలు సాధించడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వంద ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,433 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, 96.02 శాతం మేర ఉత్తీర్ణతా శాతంతో ఉత్తీర్ణులయ్యారు.

**విద్యార్థుల సంఖ్యాపరంగా టాప్ ప్లేస్ ఎంజేపీదే...** గురువారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం ప్రకారం 96.02 శాతంతో ద్వితీయ స్థానంలో ఎంజేపీ గురుకుల విద్యార్థులు నిలిచారు. స్కూళ్లు, విద్యార్థుల సంఖ్య ప్రకారం చూస్తే ఎంజేపీ విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. వంద బీసీ గురుకులాలకు చెందిన 5,501 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, 96.02 శాతంతో 5,274 మంది మేర ఉత్తీర్ణత సాధించారు. ఎంజేపీ కంటే ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల కు చెందిన విద్యార్థులు 96.04 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఎంజేపీ కంటే 0.02 శాతంతో ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులు ముందంజలో నిలిచారు. టెన్త్ పరీక్షలకు 50 ఏపీ రెసిడెన్షియల్ కు చెందిన విద్యార్థులు 3,135 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. ఆ లెక్కన చూస్తే, ఏపీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల కంటే ఎంజేపీ విద్యార్థులే టాప్ లో నిలిచినట్లు.

**గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత..** గతేడాది కంటే ఎంజేపీ స్కూళ్లలో టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతేడాది పదో తరగతి పరీక్షల్లో 95 శాతం మేర ఎంజేపీ విద్యార్థులు ఫలితాలు సాధించారు. ఈ ఏడాది 96.02 శాతంతో ఎంజేపీ విద్యార్థులు సత్తాచాటారు. గతేడాది కంటే 1.02 శాతం మేర ఫలితాలు అధికంగా రావడం గమనార్హం. 2024–25 విద్యా సంవత్సరంలో 5,355 మంది పరీక్షలు రాయగా, ఈ ఏడాది 5,501 మంది పదో తరగతిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షలకు వంద ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు పరీక్షలు రాయగా, 32 గురుకులాలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో పాసయ్యారు. ఎంజేపీ గురుకులాల్లో నంద్యాల జిల్లా నరవాడకు చెందిన విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలవడం విశేషం. ఆ పాఠశాలకు చెందిన శ్రీసాయి 596 మార్కులతో ఎంజేపీ గురుకులాలకు చెందిన విద్యార్థుల్లో మొదటి స్థానంలో నిలిచారు. రీటా సాహితి 593 మార్కులు, యశస్విని 589 మార్కులు సాధించి రెండు మూడు స్థానాల్లో నిలిచారు.

**మొన్న ఇంటర్ లో... నేడు టెన్త్ లో...** ఈ నెల 15న విడుదలైన ఇంటర్ ఫలితాల్లోనూ ఎంజేపీ విద్యార్థులు సత్తా చాటిన విషయం విదితమే. జూనియర్ ఇంటర్ లో 97 శాతంతో, సీనియర్ ఇంటర్ లో 94 శాతంతో బీసీ విద్యార్థుల ఉత్తీర్ణత సాధించారు. నేడు విడుదలైన టెన్త్ పరీక్షల్లోనూ 96.02 శాతం బీసీ బిడ్డలు ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించుకున్నారు. టెన్త్ లో రాష్ట్ర స్థాయి ఫలితాలు 85.25 శాతం కాగా, ఎంజేపీ ఉత్తీర్ణతా శాతం 96.02 శాతంగా నమోదైంది. రాష్ట్ర స్థాయి ఫలితాల కంటే 10 శాతానికి పైగా సాధించడం విశేషం. జూనియర్ ఇంటర్ లో రాష్ట్ర స్థాయి ఫలితాలు 77 శాతం రాగా, ఎంజేపీలో 97 శాతంతో, సీనియర్ ఇంటర్ లో రాష్ట్రస్థాయి ఫలితాలు 81 శాతం రాగా, ఎంజేపీ విద్యార్థులు 94 శాతంతో సత్తా చాటారు. ప్రభుత్వ పరిధిలో నడిచే అన్ని విద్యా సంస్థల కంటే ఎంజేపీ గురుకులాలు జూనియర్ ఇంటర్ లో ప్రథమ స్థానంలో, సీనియర్ ఇంటర్ లో రెండో స్థానం నిలవడం గుర్తించుకోదగ్గ విషయం.

**బీసీ హాస్టళ్లలోనూ అదే జోరు...**ఎంజేపీ గురుకులాలతో పాటు బీసీ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులూ పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్ల నుంచి 8,466 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా, 7,280 మంది ఉత్తీర్ణత సాధించారు. 85.99 శాతం మేర బీసీ హాస్టళ్ల విద్యార్థులు ప్రతిభ చాటారు. వారిలో 5,187 మంది ఫస్ట్ క్లాస్ లో, 1,437 మంది సెకండ్ క్లాస్, 652 మంది థర్డ్ క్లాస్ లో ఉత్తీర్ణులయ్యారు. 1,001 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. బీసీ హాస్టళ్లకు చెందిన విద్యార్థులు గతేడాది 77.22 శాతంతో ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 8.78 శాతం అధికంగా 85.99 శాతంతో పాసవ్వడం విశేషం. అనకాపల్లి జిల్లా రావికమతం జెడ్పీ హై స్కూల్ విద్యనభ్యసిస్తున్న బీసీ హాస్టల్ విద్యార్థిని కె.మానస మ్యాథ్స్ లో వందకు వంద మార్కులు సాధించడం విశేషం.

**అమరావతిలో సంబరాలు..** టెన్త్ పరీక్షల్లో ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 96.02 శాతంతో ఉత్తీర్ణత సాధించడంపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవితను ఆ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత మర్యాదపూర్వకంగా కలిశారు.

# శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** మే 2వ తేదీ శనివారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి. ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండపై స్వామివారి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. స్వామివారి దర్శన ఏర్పాట్లు, అదనపు క్యూలైన్లు, తాగునీరు మరియు భోజన సదుపాయాలు, అదనంగా లడ్డుప్రసాదాల తయారీ, వాహనాల పార్కింగ్, పోలీసు బందోబస్తు, దాతలు, సేవకుల సహకారం.. ఇంకా పలు ఏర్పాట్లను అధికారులతో కలిసి ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్, పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాలకు



రాష్ట్రవ్యాప్తంగా 25 నుంచి 30 వేల మంది భక్తులు తరలి రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. వారందరూ సంతృప్తిగా శ్రీ లక్ష్మీ సమేత నరసింహస్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దర్శనం అనంతరం, ప్రతి ఒక్కరికీ భోజన ప్రసాదం అందేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఆలయ అధికారులతోటి, పోలీసు సిబ్బంది తోటి ఎమ్మెల్యే మాట్లాడారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దగ్గరుండి పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, నేతలు పెగడ శ్రీనివాసులు, బొల్లినేని నాగేశ్వరరావు, కామినేని అశోక్, మోహన్, శనివారపు మాల్యాద్రి తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# వెండి గిన్నె బహుకరించిన అన్నం బాబురావు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి సందర్భంగా బందర్‌కోట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో నిత్య పూజా సేవల కోసం వంశ జ్యువెలరీ అధినేత అన్నం రామకృష్ణ బాబూరావు రూ.22,000 విలువైన వెండి బౌల్‌ను భక్తిపూర్వకంగా సమర్పించారు. ఈ వెండి బౌల్‌ను దేవస్థానం ఈవో కొండవేటి మురళి, అర్చకులు ముత్తేవి శోభనాద్రికి అందజేశారు. దేవస్థానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు, భక్తులు, . చిల్లర రాఘవరావు దంపతులు, చిల్లర మహేశ్వరరావు బాబు దంపతులు, చిల్లర శ్రీనివాస్ దంపతులు సుదర్శన హోమంలో పాల్గొన్నారు.

# కళలను, కవులను ప్రోత్సహించడం, వారిని వెలికితీయడం కూడా ఒక కళే

-తెదేపా జాతీయ ఉపాధ్యక్షులు వై.వి.బి .రాజేంద్రప్రసాద్.



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ఉయ్యూరు లోని శ్రీనివాస గ్రావిటీ విద్యాసంస్థల యాజమాన్యం వారు పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ గార్ల, పరుచూరి సేవా సమితి వార్ల ఆధ్వర్యంలో నిర్వహించిన పరుచూరి రఘుబాబు స్మారక 36 వ అఖిలభారత నాటక పోటీల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని కళల గురించి ప్రసంగించిన ఆయన మన సమాజానికి కళలు, కవులు స్ఫూర్తిదాయకమని, కళ అనేది మానవ భావాలను దృశ్యాలుగా, శబ్దాలుగా, శిల్పాలుగా మలిచే సృజనాత్మక ప్రక్రియ అని, కవిత్వం అనేది భాషను ఉపయోగించి భావాలకు అక్షర రూపం ఇచ్చే సాహిత్య కళ అని, ఈ రెండూ అంతః సౌందర్యాన్ని, మానవ అనుభవాలను వ్యక్తీకరించే మార్గాలే అని, ఈ రెండింటిని ప్రోత్సహించడం కూడా ఒక కళే అని అన్నారు. అదేవిధంగా పరుచూరి వెంకటేశ్వరరావు, పరుచూరి గోపాలకృష్ణ ఉయ్యూరు నుంచి వెళ్లి గత 3 దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో రైటర్ గా, కథారచయితలుగా, సంభాషణల రచయితలుగా, నటులుగా, దర్శకులుగా, కవులుగా, నవలా రచయితలుగా మరియు తెలుగు సినిమాల్లో ప్రధానమైన వక్తలుగా రాణించిన జంట రచయిత సోదరులు అయి న పరుచూరి బ్రదర్స్ ఈ ఊరి వారు అవడం సంతోషించవలసిన విషయమని, వారి తనయుడు స్వర్గీయ రఘుబాబు స్మారకార్థం గత 36 సంవత్సరాలుగా ఈ రాష్ట్రస్థాయి నాటక పోటీలు నిర్వహిస్తూ కళా సేవ చేస్తున్న పరుచూరి బ్రదర్స్ కి అభినందనలు తెలియజేసారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని పెట్టినటువంటి పరుచూరి శ్రీనివాస్ రావు, నీలిమ దంపతులకు అభినందనీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ పరుచూరి వెంకటేశ్వరరావు వారి కుటుంబ సభ్యులు, శ్రీనివాస విద్యాసంస్థల అధిపతులు పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ, ఉయ్యూరు హాస్పిటల్ చైర్మన్ జయదేవ్ మరియు కవులు, కళాకారులు మొదలగువారు పాల్గొన్నారు.

# ఆర్థిక చేయూత అభినందనీయం



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** కూటమి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రజాసేవ చేయడం అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేదలకు అండగా ఆర్థిక చేయూత అభినందనీయమని ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ కొండా ప్రవీణ్ కుమార్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరు రూరల్ మండలం గండిగుంట గ్రామంలో మాజీ సర్పంచ్ గుండే రాంబాబు విజ్ఞప్తి మేరకు అన్నేబాబూరావు కాలనీ నివాసులు తెదేపా సానుభూతిపరులు శాంతాటి నాగరాజు బంధువులు లకావత్ దుర్గ ఇటీవల షుగర్ వ్యాధి వలన ఇన్ఫెక్షన్ తీవ్రంగా ఉండి కుడికాలు పూర్తిగా దెబ్బతిని తీసివేయడం జరిగిందని, కుటుంబం గడవడం కష్టంగా ఉందని తెలుపగా, వెనిగళ్ల యార్లగడ్డ యూత్ ఆధ్వర్యంలో రు.5000 లు ఆర్థిక సహాయాన్ని గురువారం ఆయన, మండల తెదేపా అధ్యక్షులు వెనిగళ్ల కుటుంబరావు, తెలుగు యువత నాయకులు యార్లగడ్డ సాయి , లాకావత్ దుర్గ కు వారి ఇంటికి వెళ్లి అందించారు. మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అంటేనే ప్రజాసేవ మూల సిద్ధాంతంగా పనిచేస్తుందని, పెనమలూరు ఎమ్మెల్యే శ్రీ బోడే ప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పి4 పథకాన్ని స్ఫూర్తిగా తీసుకుని దాతలు ముందుకు రావాలని, సమాజంలో పేద వర్గాల ప్రజలకు ఆర్థిక సహకారం అందించడం ద్వారా సమాజంలో సమానత్వాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ధనలక్ష్మి, కృష్ణ, ఐటిడిపి ఉపాధ్యక్షులు గోరుముచ్చు వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

# మహాసభ ఐ టి వింగ్ , మెంబర్ షిప్ కమిటీ చైర్మన్ గా చక్కా నాని





**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఐ టి వింగ్, మెంబర్ షిప్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ గా జగ్గయ్యపేట కు చెందిన చక్కా సూర్యప్రకాష్ (నాని) ని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య నియమించారు. ఈ సందర్భంగా చక్కా నాని మాట్లాడుతూ తనపై విశ్వాసంతో ఈ పదవులు అప్పగించిన మహాసభ గౌరవ చైర్మన్ టీజీ వెంకటేష్, ఎం ఎల్ ఎ శ్రీరాం తాతయ్య,అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి మాటూరి రంగనాథ్, కోశాధికారి శిద్దా సూర్య ప్రకాశరావు, గౌరవాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ,పెనుగొండ సుబ్బరాయుడు లకు కృతజ్ఞతలు తెలిపారు. మహాసభ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఆర్యవైశ్యులు సంక్షేమం, అభివృద్ధి కోసం ఐక్యతగా ముందుకు తీసుకెళ్లే ఎంతో చరిత్ర కలిగిన మహాసభ లో రాష్ట్ర కమిటీలో తనకు స్థానం కల్పించడం పట్ల ఆనందం గా ఉందని చక్కా సూర్యప్రకాష్ (నాని)అన్నారు.



# ఆత్మీయ కలయిక



**జంగారెడ్డిగూడెం,కలంకౌంటర్ :** ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు, టీడీపీ నెల్లూరు జిల్లా అధికార ప్రతినిధి తటవర్తి రమేష్ మిత్రబృందం గురువారం మద్ది ఆంజనేయస్వామి వారి దర్శనం అనంతరం జంగారెడ్డిగూడెం లో ఏపీ ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ ను ఆత్మీయంగా కలిశారు.



# ఉపాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**కందుకూరు,కలంకౌంటర్ :** ఒంగోలులోని ప్రముఖ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉపాస్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో కందుకూరు వాసవి నగర్ నందు గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నందు ప్రముఖ మోకాళ్ళ మార్పిడి వైద్య నిపుణులు డాక్టర్ ప్రకాష్ చవల, ప్రముఖ ఇంటర్వెషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మార్తాండం వెంకటేష్, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్ పవన్ కుమార్ డాక్టర్లు ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షించారు. వారికి బీపీ, షుగర్, ఈసీసీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపవాస హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చవల మాట్లాడుతూ ఉపాస్ హాస్పిటల్ కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా సమాజానికి తమ వంతు సేవలు అందించాలనే దృక్పథంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు కందుకూరు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# పదవతరగతి పరీక్షలో రాష్ట్రంలో తృతీయస్థానం సాధించి రఘువరన్



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** పదవతరగతి పరీక్షలో ఉయ్యూరు నారాయణ స్కూల్ చెందిన వీర్ల రఘువరన్ 597 మార్కులు సాధించి రాష్ట్రంలో తృతీయ, జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఐఐటీ చదువుతా పదవతరగతిలో 597 మార్కుల సాధించిన రఘువీరన్ ఐఐటీ చదివి మంచి ఇంజనీరు కావలనుకుంటున్నట్లు తెలిపాడు. తలితండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో మంచి మార్కులు సాదించానన్నాడు. ఉయ్యూరు మండలంలో 68 శాతం ఉత్తీర్ణత ఉయ్యూరు మండలం ప్రభుత్వ పాఠశాలల్లో 68శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ 2 బి సుధారాణి తెలిపారు. ఆకునూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన కుందేరు లక్ష్మి 582 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు.

# నెంబర్ 1 స్థానంలో ఏపీ ఐ వి ఎఫ్

## 11 వేల సభ్యత్వాలు    40 లక్షలు విలువైన సేవా కార్యక్రమాలు

### -రాష్ట్ర అధ్యక్షుడు కోనా కు శుభాకాంక్షలు తెలిపిన ఐ వి ఎఫ్ జాతీయనాయకులు అశోక్ అగర్వాల్, గంజి రాజమౌళి గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా







**విజయవాడ,కలంకౌంటర్ :** ఐ వి ఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం అంగరంగ వైభవంగా చేసి అదే సభలో సేవా కార్యక్రమాలుతో ప్రయాణం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటీలు ఏర్పాటు చేసి,సమన్వయం చేసుకుంటూ ఐ వి ఎఫ్ బలోపేతం కోసం జిల్లాల అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు,వివిధ అనుబంధ సంఘాల నాయకులతో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నారు. కార్యవర్గంలో సీనియర్ లు,మహిళలు ,యువత కు పెద్ద పీట వేశారు. ఐ వి ఎఫ్ బలోపేతం కోసం క్రియాశీలకంగా పనిచేసే వారిని గుర్తించి పదవులు అప్పగించారు.త్వరలో అన్ని జిల్లాల్లో ప్రమాణ స్వీకారాలకు సన్నద్ధం అవుతున్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమం ,అభివృద్ధి ,ఐక్యత లక్ష్యంగా స్థాపించిన ఐ వి ఎఫ్ ఆంధ్రప్రదేశ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు,సేవా కార్యక్రమాలు నిర్వహణలో దేశంలో మొదటి స్థానంలో నిలిచింది. కేవలం 3 నెలల వ్యవధిలో 11 వేల సభ్యత్వాలు చేర్పించి ,పేద, మధ్యతరగతి ఆర్యవైశ్యులకు ఉపయోగపడేలా విద్యార్థులకు ఆర్థిక సాయం, ల్యాప్ టాప్ లు, సైకిళ్లు అందజేశారు.జీవనోపాధి కోసం గ్రైండర్ లు ,కుట్టు మిషన్లు,నిత్యవసర సరుకులు,మహిళలకు చీరెలు, వంటివి అందజేశారు. చలివేంద్రాలు నిర్వహిస్తూ దాహార్తి తీరుస్తూ, మరో వైపు మూగ జీవాలకు దాహార్తి తీర్చడం.కోసం తాగునీటి ట్యాంక్ లు నిర్మించారు.వివిధ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందూ ధర్మం కోసం తన వంతు ప్రచారం సాగిస్తున్నారు.



**కోనా కు జాతీయ నాయకుల శుభాకాంక్షలు....** ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు కు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా,నేషనల్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా.ఏపీ ఐ వి ఎఫ్ విభాగం దేశ స్థాయిలో మొదటి స్థానంలో నిలిపిన రాష్ట్ర కమిటీ కి అభినందనలు తెలిపారు.

**అందరి సహకారంతో మొదటి స్థానం - కోనా శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఐ వి ఎఫ్..** ఏపీ ఐ వి ఎఫ్ విభాగం మొదటి స్థానంలో నిలవడానికి సహకరించిన రాష్ట్ర కార్యవర్గం,జిల్లా కార్యవర్గాలు,అనుబంధ విభాగాల కార్యవర్గాలకు అభినందనలు తెలిపిన రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు.ఇదే స్ఫూర్తిగా రాబోయే రోజుల్లో ఐక్యతగా ముందుకు సాగుతూ,మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిద్దామని కోనా పిలుపునిచ్చారు.









Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com